క్లుప్తంగా

'సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి'

శంకరపట్నం: సమయపాలన పాటించని రెవెన్యూ ఉద్యోగులపై ఆర్డీవో చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కార్యాలయ సిబ్బంది సమయానికి రాలేదని, సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అధికారులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని, సమయపాలన పాటించని రెవెన్యూ ఉద్యోగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి విశ్వకర్మ లెజండరీ అవార్డు

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మియాపురం శ్రీనివాస్ కవి, రచయిత, ఆర్టిస్టుగా, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కృషిని గుర్తించిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ హైదరాబాద్‌వారు 2024 సంవత్సరానికి విశ్వకర్మ లెజండరీ అవార్డును ప్రకటించారు. తనను గుర్తించి అవార్డు ప్రకటించడం పట్ల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశాడు. ఆదివారం హైదరాబాద్‌లో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

'ఇసుక కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట: నిబంధనలకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం, అప్పటి మంత్రి గంగుల కమలాకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచరులు బీనామీల పేర్లతో మానేరువాగులో అక్రమంగా ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి దోపిడీకి పాల్పడ్డారని, అప్పటి ఇసుక కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. మూడు జిల్లాల పరిధిలో 38 క్వారీలకు టెండర్లు వేయించి రూ. వెయ్యి కోట్ల లూటీ చేశారని ఆరోపించారు. ఇసుక క్వారీలను నిలిపివేయాలని అనేక మంది రైతులు పోరాటం చేస్తే పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించారని రైతులపై కేసులను ఎత్తివేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్జీటీలో కేసు వేశామని, కోర్టు రూ.50కోట్ల పెనాల్టీ వేసిందన్నారు. ఇసుక రీచ్‌ల వల్ల వేలాది పంటపొలాలు దెబ్బతిన్నాయని, కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. మానేరు ఇసుక రిచ్‌ల్లో దోపిడీకి ముఖ్యకారకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇసుక మాఫియాపై పోరాటం చేసిన సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సలీం, మైస మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు ఇమ్మడి బాబు తల్లి వీరమ్మ మృతి చెందగా ఆమె కుటుంబాన్ని శుక్రవారం ప్రజా సంఘాలనాయకులు పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, పల్కల ఈశ్వర్‌రెడ్డి, చందాగాంధీ, భీమోజు సదానందం, ఇమ్మడి బాబు ఉన్నారు.

'రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది'

కరీంనగర్‌కార్పొరేషన్: రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు, కేటీఆర్ చేసిన ఆరోపణలను ఖండించారు. బీఆర్‌ఎస్ హయాంలో ధాన్యం దోపిడీకి గురవుతుంటే కేటీఆర్, హరీశ్‌రావు మొద్దు నిద్రలో ఉన్నారా అని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకొచ్చి, ఆ చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనల వల్ల వందలాది మంది చనిపోతే వీరిరువురు ఎందుకు స్పందించలేదన్నారు.

బొమ్మకల్ సబ్ స్టేషన్ తనిఖీ

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం టీజీఎన్‌పీడీసీఎల్ సీజీఎం , డైరెక్టర్ బి.అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. పీటీఆర్‌లను పరిశీలించి వివరాలనడిగి తెలుసుకున్నారు. డీఈలు రాజం, ఖాళీదాసు, ఏడీఈ కె.రాజు, ఏఈ తిరుపతి పాల్గొన్నారు.

అమ్మినోళ్లపై చర్యలు ఏవి?

- ఇటుక బట్టీలకు చేరిన చెరువు మట్టి
- కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులతో సరిపెట్టిన వైనం
- అమ్మకం, కొనుగోలుదారులను వదిలేశారనే ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న మానపల్లి గ్రామస్తులు



ఇటుక బట్టీల వద్ద కుప్పలుగా చెరువు మట్టి (ఫైల్)

జమ్మికుంట: రైతుల పొలాల్లోకి చేరాల్సిన చెరువులోని సారవంతమైన మట్టిని కొందరు ప్రజాప్రతినిధులు ఇటుకబట్టీల నిర్వాహకులకు అమ్ముకొని సొమ్ము చేసుకున్న వైనం ఇటీవల మండలంలోని మాచనపల్లిలో వెలుగుచూసింది. గ్రామ చెరువు మట్టిని ఇటుబట్టీల వ్యాపారులకు అమ్ముకున్నట్లు విచారణలో ధ్రువీకరించిన విషయం తెలిసిందే. ఆవిషయంపై గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులిచ్చారు కానీ చెరువు మట్టి దందా అమ్మకం, కొనుగోలు దారులపై ఐదు రోజులు గడుస్తునాన చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు కావడంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపణలు. ఏది ఎమైనా రైతులకు చెందాల్సిన చెరువు మట్టి, ఇటుక బట్టీలకు అమ్మడం, బట్టీల నిర్వాహకులు కొనుగోలు చేయడం రెండు నేరమని గ్రామస్తులు భావిస్తున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు కావడం వల్లే చర్యలు తీసుకోవడం లేదని మట్టి దందాపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కాగా గ్రామ కార్యదర్శి, ఎంపీడీవోను సాక్షి వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలకు పని కల్పించాలని, రైతులకు సారవంతమైన మట్టి అందించాలనే ప్రభుత్వం ఉద్దేశం నీరుగారుతోంది. గ్రామాల్లో అక్రమాలు చోటు చేసుకునే ఆస్కారం మెండుగా కనిపిస్తుంది. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఇలాంటి చర్యలు పునరావృతం అవుతాయని, చెరువు మట్టి రైతులకు ఉపయోగపడాలంటే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

చెరువు పూడికతీతతో రైతుల పొలాలకు చెందాల్సిన మట్టిని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఇటుక బట్టీల నిర్వాహకులకు అమ్ముకున్నారు. దీనిపై విచారణ చేసి ఐదు రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోడం లేదన్నారు. రెండు ఇటుక బట్టీలకు సూమారు 120 ట్రాక్టర్ ట్రిప్పులు మట్టి అమ్ముకున్నారని, మట్టి దందాను పక్కదారి పట్టించేందుకు చూస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారిలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– దొంతరవేన రమేశ్,
మాజీ ఉప సర్పంచ్, మాచనపల్లి

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



శోభాయాత్రలో మాజీ సర్పంచ్ రమేష్, భక్తులు

చొప్పదండి: మండలంలోని చాకుంట గ్రామంలో శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం, శకటోత్సవం నిర్వహించిన భక్తులు రథోత్సవంలో భాగంగా గుట్టు చుట్టూ ఊరేగింపు జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో జాతర నిర్వహించారు. చాకుంటతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కాలినడకన కొండగట్టుకు భక్తులు

పట్టణానికి చెందిన హనుమాన్ మాలధారణ భక్తులు కొండగట్టుకు శుక్రవారం కాలినడకన బయలుదేరారు. పట్టణంలోని రాంనగర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బయలుదేరారు. శనివారం పాదయాత్ర ద్వారా కొండగట్టుకు చేరుకొని అంజన్నను దర్శించుకుంటామని తెలిపారు.

నుస్తులాపూర్‌లో హనుమాన్ శోభాయాత్ర

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో హనుమాన్ దీక్షాపరులు శుక్రవారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన యాత్రను మాజీ సర్పంచ్ రావుల రమేశ్, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. యాత్ర పొడవునా భజనలు, డప్పు చప్పుళ్లు, జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శోభాయాత్రలో యువతతో పాటు చిన్న పిల్లలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులను ఆదుకోవాలి



ప్రశంస పత్రాలందిస్తున్న రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్

చిగురుమామిడి: రాష్ట్రంలోని రంగస్థల కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ కోరారు. మండలంలోని నవాబుపేట్ గ్రామంలో ప్రదర్శిస్తున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి సంపూర్ణ జీవిత చరిత్ర ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యఅథితిగా హాజరయ్యారు. బ్రహ్మంగారి చిత్రపటానికి కొబ్బరికాయకొట్టి ప్రార్థన గీతాన్ని కళాకారులతో ఆలపించారు. రెండు రోజులుగా వివిధ పాత్రల్లో నటించిన నవాబుపేట కళాకారులకు జిల్లా కళాకారుల కమిటీ తరుపున ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రం అందించారు. గత ప్రభుత్వం రంగస్థల సాంస్కృతిక కళాకారులను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రంగస్థల కళాకారులకు నెలనెలా గౌరవవేతనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి, మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, పిట్టల సంపత్, పదాల శ్రీనివాస్, కళాకారులు మల్లం బలయ్య, కుతాడి కొంరయ్య, నిలిగొండ కిషన్, గట్టు మొగిలి, కుత్బుద్దీన్, కొడపర్తి శ్రీనివాస్, సంపత్, రాజు, రాజయ్య, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆర్థిక ప్రగతికి తోడ్పడాలి



మాట్లాడుతున్న గీకురు రవీందర్

చిగురుమామిడి: రాష్ట్రంలోని బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రణాళిక రూపొందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం చిగురుమామిడిలో మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టాలని, బీసీ విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందించి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని కోరారు. జనగామ జిల్లాను సర్దార్ సర్వాయిపాపన్న జిల్లాగా ప్రకటించడం సంతోషించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, నాయకులు బుర్ర శ్రీనివాస్, మండల గీత కార్మిక సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ, పోలీస్ అధికారులు



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏవో రజిత

హుజూరాబాద్: నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలను గుర్తింపు పొందిన దుకాణాల ద్వారా కొనుగోలు చేయాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ రైతులకు సూచించారు. హుజూరాబాద్ సబ్‌డివిజన్ పోలీసుల తరఫున జై కిసాన్ పేరుతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. వర్షాకాలంలో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉండటం వల్ల రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని పంట సాగు చేయాలన్నారు. రైతుల సంక్షేమం కోసం పలు సూచనలు తెలియజేశారు. విత్తనాల కొనుగోలు బిల్లు తీసుకోవాలని, తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి నకిలీ విత్తనాలను తీసుకుంటే భారీగా నష్టపోతారని, ఎవరైనా, ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఇవ్వాలని చూసిన, రైతుల దృష్టికి వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో లేద వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు సూచనలు పాటించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి మంచి దిగుబడి పొందాలన్నారు. కార్యక్రమంలో సీఐలు బొల్లం రమేశ్, రవి, వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సైదాపూర్: నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ ఎస్‌ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని, రైతులు మోసపోవద్దని ఆయన సూచించారు. ధర తక్కువని, మోసగాళ్ళ మాయలో పడి విత్తనాలు కొంటే తీవ్రంగా నష్టపోతారని ఆయన తెలిపారు. కంపెనీ విత్తనాలు, డీలర్ల వద్దనే కొనుగోలు చేసి, రశీదులు పొందాలన్నారు. రశీదులు లేకుండా ఎలాంటి కొనుగోలు జరపరాదన్నారు.ఎక్కడైనా, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే, పోలీసులకు గానీ, వ్యవసాయాదికారులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తేకఠిన చర్యలు

ఇల్లందకుంట: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండలవ్యవసాయఅధికారి గుర్రం రజిత హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ చేసి యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విడిగా విత్తనాలు ఎవరైనా అమ్మితే చర్యలు తప్పవని, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు కొన్నవెంటనే షాపు యజమానుల నుంచి బిల్లులు పొందాలని, బిల్లులను పంటకాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోతే బిల్లుల ద్వారా నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సిరి సేడులోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రోజు బోర్డుపై ధరలు రాసి ఉంచాలని, మోసం చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రశీదుపై విత్తనాలకు సంబంధించిన లాట్ నంబర్,రైతు పూర్తి వివరాలు, ఫోన్‌నెంబర్ నమోదు చేసి అందజేయాలని సూ చించారు. తనిఖీల్లో ఏఈఓలు తిరుపతి, ఏఎస్సై రవి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పాదం విజయకనకయ్య కూతురు అపర్ణకు రూ.రెండు లక్షల యాభైవేల ఎల్‌వోసీని శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. అపర్ణ వెన్నుపూసకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం ఎమ్మెల్యేను కలిసి సమస్య విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎల్‌వోసీ మంజూరు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు బొమ్మరవేని తిరుపతి, నాయకులు కోల రమేశ్, తడగొండ నర్సింగ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల వెరిఫికేషన్

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని పంచాయతీ ఆస్తులను డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు శుక్రవారం వెరిఫికేషన్ చేశారు. పల్లెప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలు, నర్సరీ, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా విత్తనాలు

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి విశాల సహకార సంఘం ద్వారా రైతులకు పచ్చిరొట్ట, వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగాగా ఉన్నాయని సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘంలో విత్తనాల పంపిణీని ప్రారంభించారు. సీడ్ కంపెనీల ఆలస్యం వల్ల విత్తనాల పంపిణీ సరైన సమయంలో జరిగే అవకాశం లేదని, వెంటనే దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరిన వెంటనే ఆయన చొరవతో విత్తనాలు సంఘానికి వచ్చాయన్నారు. విత్తనాల పంపిణీ కార్యక్రమంలో డైరెక్టర్ మునిపాల రవి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై కిరణ్‌రెడ్డి

గంగాధర: అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్ట వచ్చని ఎస్సై కిరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సరైన అవగాహన సైబర్‌నేరాలకు నివారణ అనే పోస్టర్‌ను యువజన సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... మొబైల్ ఫోన్లకు వచ్చే లింక్‌లు నమ్మొద్దని, మోసగాల్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గజ్జెల అశోక్, ఆరెపల్లి సురేశ్, రాజ్‌కుమార్, గడ్డం ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తరువాతే ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్‌కార్పొరేషన్: బీసీ కుల గణన చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదాల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. తమ ప్రభుత్వం వచ్చాక బీసీ కుల గణన నిర్వహించి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు అన్యాయానికి గురవుతారని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు కుల గణన చేపట్టి రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని, రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

క్రీడా ప్రాంగణాల చుట్టూ బయోఫెన్సింగ్



చిగురుమామిడిలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న రవీందర్

చిగురుమామిడి: మండలంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాల చుట్టూ బయోఫెన్సింగ్‌తోపాటు విద్యార్థులు, యువకులు ఆడుకునేందుకు వీలుగా లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె. రవీందర్ కోరారు. శుక్రవారం ఎంపీఓ శ్రావణ్‌తో కలిసి చిగురుమామిడి గ్రామపంచాయతీని సందర్శించారు. అనంతరం గ్రామంలోని శ్మశానవాటిక, పల్లె ప్రకృతివనం, తెలంగాణ క్రీడాప్రాంగం, డంపింగ్‌యార్డు, వైకుంతథామం, నర్సరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధానాన్ని పాటించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామన్నారు.

మూడు గ్రామాల్లో డీఎల్‌పీఓ పర్యటన

మండలంలోని ఇందుర్తి, కొండాపూర్, రేకొండ, గ్రామాల్లో పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, తెలంగాణ క్రీడా ప్రాంగణం, నర్సరీలను డీఎల్‌పీఓ రాంబాబు శుక్రవారం సందర్శించారు. వేసవిలో చెట్లు ఎండిపోకుండా నీరు పట్టాలన్నారు. వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమణ, వెంకట్‌రమణారెడ్డి, రాంకీ, అజయ్‌కుమార్ జీపీ సిబ్బంది తదితరులున్నారు.

నాణ్యమైన యూనిఫామ్స్ అందించాలి

- మెప్మా పీడీ స్వరూపరాణి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ స్వరూపరాణి

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లను అందజేయాలని మెప్మా పీడీ స్వరూపరాణి సూచించారు. యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను ఏరియా లెవల్ సమైఖ్యలకు అప్పగించగా శుక్రవారం హుజూరాబాద్ పరిధిలోని యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రభుత్వం ఇచ్చిన సూచనల ప్రకారం యూనిఫామ్స్ కుట్టాలని, నాణ్యతతో సౌకర్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ఇచ్చిన డిజైన్‌లో మాత్రమే కుట్టాలని తెలిపారు. అనంతరం పురపాలక సంఘం హుజూరాబాద్ కార్యాలయంలో పట్టణ ఆర్పీలతో సమావేశమై మెప్మా కార్యకలపాలపై సమీక్ష నిర్వహించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామ్మోహన్‌రాయ్, ఏఈ సాంబరాజు, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, సీఎల్‌ఆర్పీలు రమాదేవి, స్వరూప, టీఎల్‌ఎఫ్‌ఆర్పీ అనూష తదితరులు పాల్గొన్నారు.

'సీనియర్ నాయకులను గుర్తించడం లేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

జమ్మికుంట: పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన సీనియర్ నాయకులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ గుర్తించడం లేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ పరిధి కొత్తపల్లిలోని ఓ ప్రైవేట ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న ఆధ్వర్యంలో కార్యకర్తల సమవేశం నిర్వహించారు. గత ఉపఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఓటమి పాలైన నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వొడితెల ప్రణవ్‌కు టికెట్ ఇస్తే ఓడినా అధిక ఓట్లు సాధించాడని, పార్లమెంట్ ఎన్నికల్లో సీనియర్ నాయకులను ప్రణవ్ విస్మరిస్తూ, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారిని అందలం ఎక్కిందారని, సీనియర్ల మనోభావాలు దెబ్బతినేలా ప్రణవ్ ప్రవర్తిస్తున్నాడని, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానానికి తెలిసేలా వివరిస్తామన్నారు. కార్యక్రమంలో తుమ్మేటి సమ్మి రెడ్డి, ఒల్లాల శ్రీనివాస్, వాసాల రామస్వామి, మారపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీంపాషా, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా



చొప్పదండి: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఉన్న వాటర్ ట్యాంకు సమీపం నుంచి వచ్చే నల్లా నీరు కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. కొద్ది రోజులుగా రంగుమారిన నీరు సరఫరా అవుతోందని, మురుగు నీరు కంటే అధ్వానంగా ఉంటోందని, ఇళ్లకు వచ్చే నీరు మట్టితో కలుస్తుండటంతో వాడటానికి ఇబ్బందిగా ఉందని, దుర్వాసన కూడా వస్తుందని, అధికారులు స్పందించి శుభ్రమైన నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.